క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కుమారస్వామి



తొర్రూరు: బాలల హక్కుల పరిరక్షణ ఫోరం(సీఆర్‌పీఎఫ్) జిల్లా ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త దొనికెన కుమారస్వామి నియమితులయ్యాడు. ఈమేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



తొర్రూరు: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో వచ్చే నెల 5న జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పట్టణంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. తాజాగా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–19 షూటింగ్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన బానోతు మధు, లూనావత్ హరికృష్ణ ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్ అభినందించారు.

విద్యాభివృద్ధికి కృషి



కురవి: డోర్నకల్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్ ఆవరణలో ఉన్న రాళ్లను పెకిలించి శుభ్రం చేసిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కురవి ఆలయ మాజీ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని నల్లెల్ల గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల వెంకన్న గుండెపోటుతో మృతి చెందగా ఎమ్మెల్యే, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మాలోత్ నెహ్రూనాయక్ నివాళులర్పించారు.

వనప్రేమికుడు దైద వెంకన్నకు పురస్కారం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రకృతి వనప్రేమికుడు, హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్నకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌజింగ్ శాఖ అధికారి డాక్టర్ రాంగాషెట్టి రమేష్, సంస్థ చైర్మన్ అల్లాడి శ్రీనివాసులు ఆదివారం విశిష్టత సేవారత్న పురస్కారం అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జాక్ వెలిన్ తెలిపారు. పాఠశాల చైర్మన్‌గా సునీత, వైస్ చైర్మన్‌గా మల్లేశం, కార్యదర్శిగా చిరంజీవి, కోశాధికారిగా ప్రియాంకలను ఎన్నుకున్నారు. సభ్యులుగా పెద్దబోయిన రవియాదవ్, శ్రీను, జ్యోతి, యాకయ్య, సందీప్, ఉమారాణి, సైదులు, రామకృష్ణ, శ్రీను, వెంకన్నలను ఎన్నుకున్నారు.

ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం..



అధ్యక్ష, కార్యదర్శులు

గార్ల: ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) మండల నూతన కార్యవర్గంను ఆదివారం గోపాలపురం హైస్కూల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏటీఎఫ్ మండల అధ్యక్షుడిగా జబ్బా వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా కబ్బాకుల వెంకన్న, ఉపాధ్యక్షుడిగా ఊకె సారంగపాణి, మహిళా కార్యదర్శిగా ఉండం శోభారాణి, కోశాధికారిగా ఎట్టి రాముదొరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మోకాళ్ల రామచంద్రు, నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన బిక్షం, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తీ భాస్కర్, హెచ్‌ఎం సిద్దబోయిన జోగయ్య పాల్గొన్నారు.

మార్చురీ గదికి మోక్షమెప్పుడో?

- మృతదేహాల పోస్ట్‌మార్టం కోసం జిల్లా ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిందే..



శిథిలమైన నిజాం కాలంలో నిర్మించిన పోస్టుమార్టం గది

గార్ల: గార్లలో నాడు ప్రభుత్వ ఆస్పత్రికి నిజాం కాలంలో నిర్మించిన మార్చురీ గది పూర్తిగా శిథిలమై కూలిపోవడంతో మండలంలో రైలు, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తూ.. మృతుల కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల, బయ్యారం మండలాలకు కలిపి నిజాం కాలంలో గార్ల గ్రామ సమీపంలోని మర్రిగూడెం రోడ్డులో నిర్మించిన మార్చురీ భవనం పూర్తిగా ధ్వంసమైంది. నిర్మించిన నాటి నుంచి నేటి వరకు అధికారులు ఈ భవనం బాగోగులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ భవనం ప్రాంతంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పోస్టుమార్టం భవనం శిథిలమవడంతో పోస్ట్‌మార్టం నిర్వహించడంలేదు. దీంతో నిరుపేదల్లో ఎవరైనా రైలు, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందితే శవ పంచనామా కోసం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ తీసుకెళ్లేందుకు వాహనాలకు అద్దె చెల్లిస్తామన్న వాహనదారులు ముందుకు రావడం లేదు. 10ఏళ్ల నుంచి పాలకులకు, అధికారులకు గార్లలో పోస్టుమార్టం భవనం నిర్మించాలని మండల ప్రజలు వేడుకున్నా ఫలితం లేదు. గార్ల ప్రభుత్వ ఆస్పత్రి సైతం శిథిలమవడంతో ఇటీవల రూ.5కోట్ల వ్యయంతో నూతనంగా సీహెచ్‌సీ ఆస్పత్రి భవనం నిర్మాంచారు. కాని ఈ నూతన ఆస్పత్రి భవనంలో పోస్టుమార్టం గది నిర్మించడం విస్మరించారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రి వెనుకభాగంలో పోస్టుమార్టం గది నిర్మాణం చేపట్టి ఆస్పత్రిలోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి యంత్రం



నీటిశుద్ధి కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిన్నగూడూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే ఉద్దేశంతో బాలవికాస, గ్రామ ప్రజల సహకారంతో 2006లో నిర్మించిన నీటిశుద్ధియంత్రం నిరుపయోగంగా మారింది. యంత్రం పాడైపోవడంతో రెండు నెలల నుంచి సురక్షిత నీరు అందక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు రాకపోవడంతో బయట కొనుగోలు చేసి అనారోగ్యానికి గురికావల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రానికి మరమ్మతులు చేపించాలని గ్రామపంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గునిగంటి మోహన్, గ్రామస్తులు ఆదివారం నీటిశుద్ధియంత్రం ముందు నిరసన చేపట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటిశుద్ధియంత్రానికి మరమ్మతులు చేపించి ప్రజలకు సురక్షిత నీరు అందించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కందుకూరు సుధాకర్, గునిగంటి వెంకన్న, మర్రి వెంకన్న, బొంగు వీరమల్లు, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం



మాట్లాడుతున్న మురళీకృష్ణ

డోర్నకల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన జీఓ నంబర్ 25ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన తుమ్మ వెంకటప్పయ్యను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బండి నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, జిల్లా కార్యదర్శి నామా నాగేశ్వర్‌రావు, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ వివేక్, మండల అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫత్తేపురం గ్రామంలో చోరీ

తొర్రూరు రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని ఫత్తేపురం గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన నలమాస అశోక్ ఆదివారం ఉదయం అదే గ్రామంలో బంధువు మృతి చెందగా అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చాడు. బీరువా తెరిచి ఉండడంతో అనుమానం వచ్చిన అశోక్ బీరువా పరిశీలించగా దానిలోని రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించగా అదనపు ఎస్సై రాంజీనాయక్ బాధితుడి ఇంటికి వచ్చి వివరాలు సేకరించారు.

దేశాభివృద్ధికి కమ్యూనిజమే ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

గార్ల: కార్పొరేట్ శక్తుల సంపద దోపిడీని అడ్డుకుంటూ సమసమాజం స్థాపనకు అహర్నిశలు పోరాటం చేస్తున్న కమ్యూనిజమే దేశాభివృద్ధికి సరైన ప్రత్యామ్నాయం అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గార్లలోని అంబేద్కర్ నగర్‌లో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకురాలు అనంతలక్ష్మి ఆవిష్కరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కమ్యూనిజమే సరైన ప్రత్యామ్నాయం అన్నారు. మహనీయుడు కారల్ మార్క్స్ చెప్పిన మాట అక్షరాల శ్రీలంక ప్రజలు ఇటీవల ఇచ్చిన తీర్పు ఉదాహరణ అని చెప్పారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం మహిళా కార్యదర్శిగా తాళ్లపల్లి రమ, పురుషుల శాఖ కార్యదర్శిగా అలువాల రామకృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కవిత, హరి, పెద్దవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీఓఏల వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉపేందర్

బయ్యారం: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారిన కార్మికుల పనిభారం మారలేదని వీఓఏలు 60రకాల పనులు చేస్తున్నప్పటికీ ఇంకా కొత్త పనులు చేయించే విధంగా పాలకులు చర్యలు తీసుకోవటం వారిపై ఒత్తిడి తేవడమే అన్నారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వసంత, కృష్ణకుమారి, శ్రీను, మంజుల, సనీత, జీవిత, పూలంబాయి, పద్మ, సుహాసిని పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యాదేవిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంపులను ఆదివారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో సుమారుగా 10 ట్రాక్టర్లు(రెండు డంపులు)అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సమాచారం మేరకు తనిఖీ చేసి సీజ్ చేశామన్నారు. అక్రమంగా నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

గూడూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఉచిత హామీలను కురుపించి గద్దెనెక్కిందన్నారు. కానీ వాటిని అమలు చేయడం విస్మరించిందని, హైడ్రా పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మరిపిస్తుందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం వికసిత్ భారత్ కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేరెడ్డి సురేందర్, చెల్పూరు వెంకన్న, దోసపాటి శ్రీనివాస్, పూజారి వెంకన్న, గద్దం శ్రీను, చిరి, జంపయ్య, రాజు, నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గూడూరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరంగా ఉంటాయని సుశృత ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ చౌకీదారు రవీందర్ అన్నారు. మండలంలోని ఏపూరు గ్రామంలో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 75 మందిని పరీక్షించి వారికి అవసరమైన మందులు అందించారు.

కులవివక్ష నిర్మూలనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

బయ్యారం: శాస్త్ర, సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటికి దేశంలోని పలు ప్రాంతాల్లో కులవివక్షత కొనసాగుతుందని కులవివక్ష నిర్మూలనకు పాలకులు కృషి చేయాలని సొసైటీ మాజీ చైర్మన్ రామగిరి భిక్షం, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావం సందర్భంగా ఆదివారం బయ్యారంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, నాగేశ్వరరావు, సంగన్న, ఐలయ్య, యుగంధర్ పాల్గొన్నారు. న్యూడెమోక్రసీ(యతీంద్రకుమార్ వర్గం) ఆధ్వర్యంలో మండలంలోని బాలాజీపేటలో కుల నిర్మూలనలో భాగంగా సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

కొత్తగూడ: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కార్లాయిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొడుగు ప్రేమ్‌సాగర్(20) సాయంత్రం సమయంలో స్నేహితులతో కలిసి కూల్‌డ్రింక్ తాగుతూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే ప్రైవేటు వాహనంలో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ప్రేమ్‌సాగర్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఆరోగ్యానికి నడక తప్పనిసరి



2కే రన్ ప్రారంభిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఆరోగ్యంగా ఉండాలంటే రోజు 30నిమిషాలపాటు నడవాలని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య అన్నారు. జాతీయ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంభయ్య, గౌరవ అధ్యక్షుడు రవీంద్రగుప్తా, వీరన్న, ఉపేంద్రం, కృష్ణమూర్తి, శ్రీనివాస వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న దేవేందర్

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో వరదలతో తెగిపోయిన చెరువులకు మరమ్మతులు చేపట్టాలని మెపా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మెపా ఆధ్వర్యంలో ఆదివారం వివిధ గ్రామాలల్లో తెగిపోయిన చెరువు కట్టలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు కట్టలు తెగిపోయి జీవనాధారం కోల్పోయిన మత్స్యకారులకు వెంటనే పరిహారం అందించి చెరువులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, చిరంజీవి, రామకృష్ణ, రాజు, అయిలయ్య, దుర్గేష్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలి

నెల్లికుదురు: కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో కొలువై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, గంటా బాలకృష్ణరెడ్డి, సామల వెంకన్న, సంద పవన్, రమేష్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కేసముద్రం: మండలంలోని తావుర్యాతండాజీపీలో గల దుర్గామాత ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను, తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్‌ఈ, ఆలయ కమిటీ చైర్మన్ చైతన్యకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భద్రునాయక్, భుక్యానెహ్రూనాయక్, రామచంద్రునాయక్, జాటోత్ వెంకన్న, యాకుబ్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



కేసముద్రం: ఇనుగుర్తి మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అడ్‌హక్ నూతన కమిటీ అధ్యక్షుడిగా గండు నాగన్న ఎన్నికయ్యాడు. ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగిన ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఈమేరకు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కందాల రంగన్న, కోశాధికారి కూటికంటి మధు, ఉపాధ్యక్షులు మామిడి శోభన్, లింగాల నర్సయ్య, శ్రీనివాస్, వెంకన్న, సంయుక్త కార్యదర్శులను, గౌరవ సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: దళిత పోరాట స్ఫూర్తి, దివంగత న్యాయవాది బొజ్జ తారకం సతీమణి విజయభారతి మృతిచెందగా హైదరాబాద్ బేగంపేటలో ఆమె మృతదేహానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, ఓయూ నాయకుడు శేఖర్ ఆదివారం నివాళులర్పించారు.

రైల్వేగేటు మూసివేత

గార్ల: గార్ల–డోర్నకల్ మధ్యలో గల రైల్వేగేటు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా రైల్వేగేటు నేటి వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. గార్ల నుంచి డోర్నకల్, ఖమ్మం వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు.

సమసమాజ స్థాపనే లక్ష్యంగా పోరాడాలి

కేసముద్రం: సమసమాజ స్థాపనే లక్ష్యంగా కమ్యూనిస్టులు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణిగంటి రాజన్న అన్నారు. ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామశాఖను ఎన్నుకున్నారు. గంజి సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, పాపారావు, యాకుబ్‌రెడ్డి, జయరాజ్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామికి పూజలు

తొర్రూరు రూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలో ఆదివారం గీతకార్మికులు కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ ప్రముఖులు చీకటి శ్రీనివాస్, చీకటి బిక్షం, మాచర్ల రమేష్, కుర్ర వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం



తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము రాంచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతోపాటు చదివిన 1994–95 బ్యాచ్ పదో తరగతి మిత్రులు రూ.20వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ధీకొండ శ్రీనివాస్, వెంకటరమణ, కృతిరెడ్డి, కొమురెల్లి, సారయ్య, వెంకన్న, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో ఇటీవలే మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గంధసిరి యాదగిరి మృతిచెందగా ఆదే గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆదివారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

పరామర్శ..

దంతాలపల్లి: మరిపెడ ప్రాథమిక వైద్యశాలలో లోయర్ డివిజన్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఆదివారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సీనియర్ నాయకుడి మృతి

గార్ల: మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల సీనియర్ నాయకుడు వంకాయల ఎల్లయ్య(65) ఆదివారం మృతిచెందాడు. టీడీపీ మండల అధ్యక్షుడు వై.కృష్ణారెడ్డి, రమేష్, సుజ్ఞానప్రసాద్, రాంజీ మృత దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రవక్త బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న ముజీద్

డోర్నకల్: మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని జేఐహెచ్ ఖమ్మం జిల్లా ప్రతినిధి జనాబ్ అబ్దుల్ ముజీద్ తెలిపారు. స్థానిక అశోక్‌భవన్‌లో ఆదివారం జమాతే ఇస్లామి హిందు ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త బోధనలపై నిర్వహించిన సదస్సులో అబ్దుల్ ముజీద్ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ ప్రజలందరికీ హితబోధమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, జేఐహెచ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్‌సాబ్, వాజీద్, అస్లాంఖాన్ పాల్గొన్నారు.

మహావీర్ భగవాన్ శోభాయాత్ర




శోభాయాత్రలో పాల్గొన్న జైనులు

గార్ల: దసలక్షణ్ పర్వ్ ముగింపు రోజు ఆదివారం జైన్‌ల ఆరాధ్యదైవం మహావీర్ భగవాన్ ఊరేగింపును గార్ల పురవీధుల్లో జైన్‌లు ఘనంగా నిర్వహించారు. 10రోజులపాటు జైన్‌లు ఉపవాసాలు ఉండి గార్లలోని జైన్ మందిరంలో మహావీర్ భగవాన్‌కు అభిషేకాలు, శాంతిపూజలు నిర్వహించారు. చివరి రోజున మహావీర్ భగవాన్‌ను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్, విమల్‌కుమార్, కిశోర్, మహావీర్ పాల్గొన్నారు.

ఘటనపై ఎమ్మెల్యే ఆరా

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని వృద్ధుడి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మావోయిస్టులమంటూ నగదు చోరీ చేసిన ఘటనపై ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆరా తీశారు. ఆదివారం మండల కేంద్రంలోని బాధితుడు సూధగాని వెంకటయ్య ఇంటికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానిక ఎస్సైకు సూచించారు.

కష్టపడిన వారికే బంగారు భవిష్యత్



సింధును సన్మానిస్తున్న స్టడీ సర్కిల్ బృందం

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి దశ నుంచే కష్టపడ్డ వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని భగత్‌సింగ్ స్టడీసర్కిల్ అధ్యక్షుడు క్లెం వీరారెడ్డి అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామకంలో ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కాలేరు సింధును స్టడీసర్కిల్ సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ గౌరవ అధ్యక్షుడు సోమ గోవర్ధన్, కోశాధికారి ఉప్పలయ్య, సభ్యులు సదానందం, శ్రీనివాసులు, సైదులు, మల్లయ్య పాల్గొన్నారు.